## క్లుప్తంగా

### మూడు రోజుల్లోగా నివేదికలు సమర్పించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ సుజాత

**అశ్వారావుపేట:** అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమితురాలైన సుజాత మంగళవారం విధుల్లో చేరారు. అశ్వారావుపేట, గుర్రాలచెరువు, పేరాయిగూడెం పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ, ఎంఈఓలతో సమావేశమయ్యారు.

మూడు పంచాయతీల తీర్మానాల పుస్తకాలు, బిల్‌పుస్తకాలు, క్యాష్‌బుక్స్, భవన నిర్మాణ అనుమతుల పుస్తకాలు స్వాధీన పరుచుకున్నారు. మిగిలిన అన్ని రకాల నివేదికలను రెండు, మూడు రోజుల్లోగా పూర్తి చేసి సమర్పించాలని కార్యదర్శులకు, ఎంపీడీఓ ప్రవీణ్‌కు సూచించారు. వారి వెంట టీపీఓ నవీన్ కుమార్, జేఏఓ కిరణ్‌కుమార్, ఏఈఈ రాము, కార్యదర్శి శ్రీరామమూర్తి ఉన్నారు.

### ఉత్తమ రైటర్‌గా లక్ష్మీనారాయణ



ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

**పినపాక:** ఈ బయ్యారం పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఉత్తమ జిల్లా రైటర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఫిర్యాదుదారులతో మంచితనంతో మెలిగి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నిస్తున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### రజక సంఘం ప్రదర్శన

**అశ్వారావుపేట:** పాల్వంచ పట్టణానికి చెందిన చిటికెన ముసలయ్యపై దాడిని ఖండిస్తూ అశ్వారావుపేట మండలం రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరశన వ్యక్తం చేశారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఐ యయాతి రాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం బుక్కూరి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు గుమ్మడి ఆదినారాయణ, కార్యదర్శి శ్రీను, పలాంటి సాయి, నారాయణ, అప్పన్న పాల్గొన్నారు.

### సీపీఐ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

**అశ్వారావుపేట:** సీపీఐ నాయకులు, కార్యకర్తలకు పార్టీ కోసం పాటుపడి రానున్న అన్ని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సయ్యద్ సలీం పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గన్నిన రామకృష్ణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి పఠాన్ జలాల్ ఖాన్, చీపుర్ల సత్యవతి, రిజ్వానా, దిల్షాద్, సూర్యకుమారి, రసూల్‌బీ, దోమల అనిల్, జక్కం బలరాం తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల నిరసన



జీఓ పత్రాలను చూపుతున్న ఉపాధ్యాయులు

**దుమ్ముగూడెం:** మండలంలోని మరాయిగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూపీఎస్ జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏటిఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు బలవంతంగా వర్తింపజేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. తక్షణమే ఓపీఎస్ ఉద్యోగస్తులుగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండల ప్రధాన కార్యదర్శి పూనెం రమేష్,ఏటిఏ రాష్ట్ర కోశాధికారి సోయం హనుమంతరావు, సోడి రాంబాబు, సోడి సత్యప్రసాద్, పూనెం హిందులత,కాంతారావు, గొర్రె రామకృష్ణ, వర్ష సీతయ్య, రమేష్, బాలరాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు..



గౌందిగూడెంలో ఇసుకవాగుపై వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**అశ్వాపురం:** మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ స్వర్ణలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. గౌందిగూడెం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

గౌందిగూడెంలో ఇసుకవాగుపై హైలెవల్ వంతెన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వంతెన పనుల్లో నాణ్యత పాటించాలని, పనులు వేగవంతం చేసి వర్షాకాలంలోపు పూర్తి చేయాలని సూచించారు. రామవరం గ్రామంలో వజ్జా నారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ వరప్రసాద్, ఏఓ సాయిశంతన్ కుమార్, ఎంపీఓ ముత్యాలరావు, ఏఈ చక్రధరాచారి, అధికారులు, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు కాకా రాములు, పాయం భద్రమ్మ, పొడియం అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# గద్దర్‌పై వ్యాఖ్యలు సరికాదు



మణుగూరుటౌన్: దిష్టిబొమ్మతో బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

**దమ్మపేట:** ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని, మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు కాకా రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, తనదైన శైలిలో పాటల ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన విప్లవ వీరుడు గద్దర్ అని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**మణుగూరుటౌన్:** ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ.. గద్దర్ తన గానంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉత్తేజ పరిచిన గద్దర్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి బండి సంజయ్‌ని క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నవీన్, యూత్ నాయకులు రాసమల్ల నాగరాజు, లక్ష్మిప్రగతి, మణుగూరు, బూర్గంపహాడ్ మండలాల అధ్యక్షులు సతీష్, హరీశ్, యాదవ్, కన్నెపల్లి శివ, లిఖిత, ప్రవళిక, గొల్లపల్లి నరేశ్ కుమార్, సింహాద్రి హనుమంతు, కరుణ్‌రెడ్డి, అజిత్, సాధిక్, మురికిపూడి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

**అశ్వాపురం:** గద్దర్‌ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్‌సాయి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ పినపాక నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్రబాబు, కల్యాణ్, సురేష్, రమేష్, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీల్లో ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై

**అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ):** పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శాఖపరంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో అన్నపురెడ్డిపల్లి ఎస్‌ఐ సీహెచ్ చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రం లభించింది. ప్రశంసా పత్రంతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని మంగళవారం ఆయన హైదరాబాద్‌లో డీజీపీ డాక్టర్ జితేందర్ చేతులమీదుగా అందుకున్నారు.

'సౌండ్‌మైండ్–సౌండ్‌బాడీ' అనే అంశంపై డిసెంబర్ నెలలో జిల్లాకేంద్రం కొత్తగూడెంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రం దక్కడం పట్ల పోలీస్ ఉద్యోగులు అభినందించారు.

### తహసీల్దార్‌కు సన్మానం

**దుమ్ముగూడెం:** ప్రజలకు అందించిన విశేష సేవలకు గాను రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న దుమ్ముగూడెం తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్‌ను మంగళవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనకు పూల బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు పూదోట సూరిబాబు, సంఘం నాయకులు కనుబుద్ది దేవా, జూలకంటి సుధాకర్, బైరెడ్డి అరవింద్, లంక రమేష్ తదితరులు ఉన్నారు.

### 'ప్రజాపాలనలో కష్టాలు రెట్టింపు'

**కరకగూడెం:** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రజల కష్టాలు రెట్టింపు అయ్యాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అధికారమే లక్ష్యంగా అడ్డగోలు హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాకా వాటిని విస్మరించడం దారుణమని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్న పూర్తిస్థాయిలో ఇప్పటివరకు క్యాబినెట్ ఏర్పాటు చేసుకోకపోవడాన్ని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ ఊకె రామనాథం, పార్టీ నాయకులు పోగు వెంకటేశ్వర్లు, బుడగం రాము, బైరిశెట్టి చిరంజీవి, రావుల కనకయ్య, సయ్యద్ ఫజల్ హుస్సేన్, గుడ్ల రంజిత్, చిట్టిమల్ల ప్రవీణ్, దాసరి సాంబయ్య కల్లూరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు స్వీట్లు పంపిణీ

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణం శాంతినగర్ కాలనీలోని కహోల్ దివ్యాంగుల అనాథ పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని నేతాజీ ప్రైవేట్ ఆస్పత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం చిన్నారులతో కేక్ కట్ చేయించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ నిర్వాహకుడు బిర్రు సుధాకర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

**చర్ల:** మండలంలోని కలివేరు గట్టుపై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ పోతురాజు స్వామి రాతిశిల విగ్రహ ప్రతిష్ఠాపనకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 31 శుక్రవారం ఉదయం11.54 గంటలకు మాఘ మాసం శుద్ధ విధియ తిథి శతభిష నక్షత్ర యుక్త మేష లగ్నపుష్కరాంశంలో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుండగా.. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితులు డి.రాఘవశర్మ నేతృత్వంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రుగొండ: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చంద్రుగొండ:** మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఏకకాలంలో చేపట్టిన నేపథ్యంలో ప్రజాపాలన ప్రారంభమైందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భోజ్యా నాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, ఫజల్‌బ, దారం గోవిందరెడ్డి, ఎస్డీ రసూల్, బొర్రా సురేష్, అంతటి రామకృష్ణ, ఎస్‌కె.అన్వర్ పాల్గొన్నారు.

**మంద కృష్ణ చిత్రపటానికి..**

**మణుగూరురూరల్:** పద్మశ్రీ అవార్డ్ గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి మంగళవారం అంబేడ్కర్ సెంటర్‌లో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మశ్రీ ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిళ్ళ వెంకటేశ్వర్లు, కొమ్ము హుస్సేన్, చిట్యాల రజిత, ఉసికెల కొండయ్య, మోదుగు వెంకటేశ్వర్లు, దేపాక నరసయ్య, మంద కృష్ణ, బాసిపోగు వెంకటేశ్వర్లు, బోయిల సత్యం, పాడుతూరి కల్యాణ్, జి మోహన్‌రావు, కృష్ణ, వెంకన్న, నాగరాజు, సాయికుమార్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి

**ములకలపల్లి:** అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ములకలపల్లి మండల కార్యదర్శి కుంజా కృష్ణ అధ్యక్షతన మంగళవారం మాధారంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలను నిరసిస్తూ ఫిబ్రవరి 20న చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. వరుకూటి వెంకట్రావు, కొండపనేని సత్యనారాయణ, ఇంటిక లక్ష్మి, సవళ్ల ఆదినారాయణ, వంకా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి

**భద్రాచలంటౌన్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు మినిమం టైమ్స్ స్కేల్ ఇచ్చి, సమాన పనికి సమాన వేతనం అమలు చేసే విధంగా కృషి చేయాలని భద్రాచలం గిరిజన గురుకుల టీచర్స్, లెక్చరర్లు మంగళవారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కోదండరామ్.. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన గురుకులాల పార్ట్ టైం ఉద్యోగులు దేవన్ బాబు, జీవీఎల్, రాంబాబు, వీరభద్రం, తోటమల్ల బాలయోగి, సరోజిని, హేమలత, వసుమతి, రాజేశ్వరి, శిరీష, లీల, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రాజయ్యకు గుణపాఠం చెబుతాం..



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

**చర్ల:** మాజీ మంత్రి తాటికొండ రాజయ్య కాంగ్రెస్ ప్రజాప్రజాప్రతినిధులపై చేసిన వ్యాఖ్యలు సరికాదని టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు అన్నారు. చర్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం, మంత్రులతో పాటు డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందినిపై రాజయ్య ఇష్టారాజ్యంగా మాట్లాడడం గర్హనీయమని తెలిపారు. ఇకనైనా ఆయన తీరు మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### కరివేపాకు మొక్కలు నాటాలి

**మణుగూరురూరల్:** మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కరివేపాకు, మునగ మొక్కలను నాటాలని ఏఓ రాహుల్ రెడ్డి, ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావులు సూచించారు. గుట్టమల్లారంలోని రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కరివేపాకు, మునగ మొక్కలను నాటడం వల్ల పిల్లలకు మధ్యాహ్న భోజనంలో వీటిని ఉపయోగించడంతోపాటు అనేక ప్రయోజనాలను అందించవచ్చని తెలిపారు. నర్సరీలలో ఆయా మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీడీపీఓ జయలక్ష్మి, ఏఈఓ హారిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

### దుప్పట్ల పంపిణీ

**ములకలపల్లి:** పాతగుండాలపాడు జీపీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలకు జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు వితరణగా అందజేశారు. పాలవాగు, ఒర్రెగుంపు గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై కిన్నెర రాజేశ్‌ఖర్ చేతుల మీదుగా గొత్తికోయ కుటుంబాలకు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు, కానిస్టేబుల్ తిరుపతి, తంబళ్ల నర్సింహారావు, మధు, రాము, కోళయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పరిశీలన.. పరిశోధన

వివిధ ప్రాంతాల్లోని ఆయా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు తరగతి గది దాటి బయటికొచ్చారు. ఆయా ప్రాంతాల్లోని నర్సరీలు, మార్కెట్‌లు, అడవుల్లో పలు రకాల అంశాలకు సంబంధించి పరిశీలన చేశారు. పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు.

### 'గురుకుల' స్టడీ టూర్..



అశ్వారావుపేటరూరల్: ఆలయాన్ని సందర్శించిన డిగ్రీ విద్యార్థుల బృందం

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(దమ్మపేట)కు చెందిన విద్యార్థుల బృందం మంగళవారం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ స్టడీ టూర్‌లో భాగంగా కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థునుల బృందం మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న యంత్ర రాజాసహిత కాశేశ్వరస్వామి, చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయాలను సందర్శించారు. ఉపాధ్యాయులు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లతోపాటు మీ సేవా కేంద్రం, కూరగాయల మార్కెట్, సూపర్ మార్కెట్‌లను సందర్శించి మార్కెటింగ్ చేసే విధానం, వాటి నిర్వహణ, లావాదేవీల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వందన, అధ్యాపకులు సీహెచ్ గోపాల్, జె.సరిత, మహేశ్వరి, వెంకటలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

### అడవుల్లోకి 'అటవీ' విద్యార్థులు..



భద్రాచలంటౌన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీఓ

**భద్రాచలంటౌన్:** అటవీ శాఖ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అడవులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ఎఫ్‌డీఓ సుజాత అన్నారు. భద్రాచలం రేంజ్ పరిధి కొమ్మనపల్లి బీట్‌లో ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు అడవులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ విద్యార్థులకు వివిధ రకాల అటవీ పనులు, జాతుల గుర్తింపుతో పాటు ప్లాంటేషన్ నిర్వహణ, ఫైర్ కంట్రోల్ డెమోలను వివరించారు. ఈ కార్యక్రమలో ఆటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 'కస్తూర్బా' నేచర్ క్యాంప్..



దుమ్ముగూడెం: నర్సరీలో మట్టి నమూనాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

**దుమ్ముగూడెం:** మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో తెలంగాణా గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో మంగళవారం నేచర్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సైన్స్ అధికారి చలపతి రావు మాట్లడుతూ.. ఈ క్యాంపు మూడు రోజులు కొనసాగుతుందని, ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థినులను క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్లి నేల భూసారం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. మండల విద్యాధికారి సున్నం సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ శిబిరం వలన స్వీయ అభ్యసనం ద్వారా ప్రకృతి గురించి తెలుసుకుంటారని తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థినిలకు గ్రీన్ కార్ప్స్ కిట్స్ అందజేశారు. అనంతరం ర్యాలీగా పర్యావరణం పరిరక్షించాలని నినాదాలు చేసి అటవీ శాఖ నర్సరీ సందర్శించారు. కార్యక్రమంలో గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఎవి.రామారావు, ఎస్‌ఓ శోభారాణి, గైడ్ టీచర్స్ తోటమల్ల సురేష్ బాబు, ఎజె.ప్రభాకర్, శ్రీనివాస్, టి.శ్రీనివాస్, డి.సుజాత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుడికి ఘన సన్మానం

**మణుగూరుటౌన్:** పరుగుల పతకాల యోధుడు జల్లా రవీందర్‌కు కార్మిక సంఘాలు, పీవీకాలనీ వాసులు, మిత్రులు మల్లారం, కోదండరామాలయం ఆవరణలో పుష్పగుచ్ఛం అందించి మంగళవారం సాయంత్రం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇఫ్టూ నాయకులు నాజర్‌పాషా అధ్యక్షతన జరిగిన సత్కార కార్యక్రమంలో అతిథులుగా ఐఎన్‌టీయూసీ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు హాజరై మాట్లాడారు. 64 సంవత్సరాల వయసులోనూ ఈ నెల హైదరాబాద్‌లో గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్‌లో గోల్డ్‌మెడల్, ట్రిబుల్ జంప్‌లో గోల్డ్ మెడల్, పరుగు పందెంలో బ్రాస్ మెడల్‌తో పాటు ఉస్మానియా గ్రౌండ్‌లో జరిగిన అథ్లెటిక్స్ తెలంగాణ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2025గా నిలిచి మణుగూరు ప్రగతిని చాటారన్నారు. కార్యక్రమంలో నాయకులు సిల్వేరు గట్టయ్య, గుగులోత్ దశరత్, అంగోత్ మంగీలాల్, పగిడిపల్లి సతీష్, కీసర శ్రీనివాసరెడ్డి, గురు ప్రసాద్, శంకర్, రియాజ్, అజిత్, గాలీబ్‌పాషా, వడ్డే శంకర్, వివేక్ కుమార్, చంటి వర్మ రాజు, పలువురు సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

# వైద్యశిబిరం ఏర్పాటు..




మణుగూరురూరల్: గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని గొల్లకొత్తూరు గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులను అందజేశారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిని మాట్లాడుతూ.. పౌష్టికాహారం భుజించాలని, తగిన వ్యాయామం చేయాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, సుజాత, కృష్ణ, ప్రేమ్, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**పశువైద్యశిబిరం..**

**చర్ల:** రైతులు వారి పశువులకు వ్యాధులు సంక్రమించక ముందే టీకాలు వేయించడం వల్ల వ్యాధులను దరి చేరనీయకుండా చూసుకోవచ్చునని సత్యనారాయణపురం పశు వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ క్రామిక సూచించారు. మండలంలోని ఆర్ కొత్తగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరంలో పశువులకు టీకాలు వేసిన అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులను నివారించి, పిండోత్పత్తి చేయడంపై వివరించారు. ఈ సందర్భంగా సుమారు 100 పశువులకు టీకాలు వేశారు. పంచాయతీ కార్యదర్శి శోభారాణి, కిసాన్ కేత్ డివిజన్ అధ్యక్షుడు ఇందుల బుచ్చిబాబు, రైతులు గొర్ల రాజబాబు, తుర్రం రవికుమార్, ఏనూటి గిరిబాబు, కూరపాటి గంగరాజు, సున్నం గంగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

# పీడీఎస్‌యూ పోస్టర్ల ఆవిష్కరణ



గుండాల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

**భద్రాచలంటౌన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా లక్ష్యాలను విస్మరించకుండా విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. భద్రాచలం వేదికగా ఫిబ్రవరి 4, 5 తేదీల్లో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభల పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పాలకులు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై జరిగే ఈ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, డివిజన్ కార్యదర్శి శివ ప్రశాంత్, నాయకులు నరసింహారావు సంధ్య, శృతి, అనూష, బాలకృష్ణ, సాయి, వర్ధన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

**గుండాల:** విద్యారంగ బలోపేతం కోసం, సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 4, 5 తేదీలలో భద్రాచలం పట్టణంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయాలని ఆ సంఘం ఇల్లెందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గుండాల మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌన్సిల్‌లో భవిష్యత్ ఉద్యమ రూపకల్పనలు చేసి, విద్యారంగ సమస్యలపై అనేక తీర్మానాలు చేసి, విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి పోరాటాల రూపకల్పన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్, మహేష్, తరుణ్, అఖిల్, పవన్ పృథ్వి పాల్గొన్నారు.